# ఎవరు ముందు?

నిత్యం తీసుకునే మందుల్లో కొన్ని అయిపోతే, కొని తెచ్చుకుందామని బయలుదేరాను. మా సందు ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం యజమాని దుకాణం గుమ్మం ముందు వంగి అట్టపెట్టెలు సర్దుతున్నాడు. నేను ఒక్కక్షణం తటపటాయించాను అతన్ని పలకరించాలా వద్దా అని. మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు పలకరించవచ్చులే అనుకుని ముందుకి సాగాను.

ఆ దుకాణం యజమానితో మాట్లాడి మూడేళ్ళయింది. అంతకు ముందు అతని దుకాణం నుంచి ఎన్నో చిల్లర మల్లర వస్తువులు కొంటూ ఉండేదాన్ని. పెద్దనోటుకి చిల్లర కావాలన్నప్పుడల్లా ఏదో ఒక వస్తువు కొంటూండేదాన్ని. ఎప్పుడైనా ఖాళీ అట్టపెట్టె పెద్దది కావాలంటే ఇచ్చేవాడు. చవగ్గా తీసుకుంటా నన్నా ఊరికే ఇచ్చేవాడు. పొద్దున్నే దుకాణం తెరవగానే వచ్చి మా గేటుపై నుంచి అవతలకి వెళ్ళాడుతున్న కొమ్మల్ని వంచి పూలు కోసుకునే వాడు. దుకాణంలో దేవుడి పటం ముందు ఆ పువ్వులు పెట్టి దీపం వెలిగించి, ఆ తరవాతే అమ్మకాలు మొదలు పెట్టేవాడు.

ఈ అలవాటుకి విఘ్నం కలిగింది ఒకనాటి సంఘటనతో. మా అత్తయ్య మనవడు ఢిల్లీ నుంచి ఏదో పని మీద వచ్చి మా ఇంట్లో దిగాడు. పొద్దున్నే గేటు అవతల నుంచి వేళ్ళాడుతున్న కొమ్మల్ని లాగుతూ ఎవరో పువ్వులు కోస్తున్నారని నాతో చెప్పాడు మా మేనల్లుడు. నేను వంటింట్లో ఉన్నాను. ఆ సమయంలో పూలు కోసేదెవరో నాకు తెలుసు.

"సందు ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం యజమాని రోజూ వచ్చి అలాగే కోసుకుంటాడు. రోజూ పనిమనిషి ఊడ్చి వెళ్ళాక వస్తాడు" అన్నాను. పని హడావిడిలో ఉన్నానేమో, నా కంఠంలో విసుగు ధ్వనించి ఉంటుంది. వెంటనే వెళ్ళి ఆ దుకాణం యజమానిని అడ్డుకున్నాడట పువ్వులు కోసుకోకుండా. నేను చూడలేదు. వాళ్ల మాటలు నాకు వినిపించ లేదు.

"దేవుడి కోసం నాలుగు పువ్వులు కోసుకుంటే తప్పేమిటి?" అన్నాడుట దుకాణం అతను.

...తప్పే, ఆ కొమ్మల్ని అలా గుంజితే ఆకులు కిందికి రాల్తున్నాయి. శుభ్రంగా తుడిచిన చోటంతా పాడవుతోంది. పైగా, ఆ కొమ్మలు కిందికి వేళ్ళాడి తలకి తగుల్తున్నాయి" అన్నాడుట మా మేనల్లుడు.

"ఈ ఇంటావిడ ఎప్పుడూ అడ్డుపెట్టలేదు. కొత్తగా వచ్చిన నువ్వు అడ్డుకోవడం ఏంటి?" అన్నాడుట దుకాణం అతను

ఆ తరవాత ఇంకా వాగ్వివాదం కొనసాగించాక, మొత్తం మీద అతను పువ్వులు కోసుకోవడానికి మళ్ళీ రాకుండా కట్టుదిట్టం చేశానని మా మేనల్లుడు లోపలికొచ్చి సగర్వంగా చెప్పాడు నాతో. అతను చెప్పిన దాన్ని బట్టి, దుకాణం యజమాని అంత పరుషంగా మాట్లాడకుండా ఉండాల్సిందనీ, నన్ను పిలిచి అడిగినా బావుండేదనీ అనిపించింది నాకు. చుట్టపు చూపుగా వచ్చిన మా మేనల్లుడితో నాకు సత్సంబంధాలు లేకుండా పోవడం ఇష్టం లేక, ఆ దుకాణం యజమానిదే తప్పు అన్నాను, మావాణ్ణి సమర్థిస్తూ.

ఆ దుకాణానికి వెళ్ళడం మానేశాను. అటువైపు నుంచి వెడుతూంటే అతనే నన్ను చూసి ఏదో సంజాయిషీ ఇస్తాడనో, నన్ను ఏదో ఒక రోజున మామూలుగా పలకరిస్తాడనో ఆశించాను. కానీ నన్ను చూసినా పలకరించడం మానేశాడు. నేనూ అతనివైపు చూడటం మానేశాను. ఏ చిన్న వస్తువు కావాలన్నా, ఏదైనా వస్తువు హఠాత్తుగా కావాలన్నా వీధి చివరి వరకూ నడిచి వెళ్ళాల్సి వచ్చేది. దగ్గరున్న దుకాణానికి వెళ్ళడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చేది. పౌరుషం పురుషుడికేనా, స్త్రీకి ఉండదా? దుకాణం నడిపే అతనికే అంత పట్టింపు ఉంటే, కొనుగోలు చేసే నాకెంత పట్టింపు ఉండాలి! ఇటువంటి ఆలోచనలు నాలో పట్టుదలని పెంచినా, మరోవైపు నేను చదివిన తాత్త్విక గ్రంథాలు నన్ను ఆత్మాన్వేషణకీ, అంతర్దృష్టికీ పురికొల్పేవి. 'నేను', 'నా హోదా' అనే అహాన్ని విడిచిపెట్టకపోతే ఎన్ని గ్రంథాలు చదివినా ప్రయోజనం ఏమిటి అని నిలదీసేవి. అయినా నా అహాన్ని విడిచిపెట్టలేకపోయాను.

అంతకుముందు మా వారితో చిన్న చిన్న కలహాలు వచ్చినప్పుడు అలిగి ఒకరితో ఒకరం మాట్లాడుకునే వాళ్ళం కాదు కొంతసేపు. ఎవరు ముందు మాట్లాడాలి అని బిగుసుకుని ఉండేవాళ్ళం. ఒక్కొక్కప్పుడు ఆయనా, ఒక్కొక్కప్పుడు నేనూ మెత్తబడి, మామూలుగా మాట్లాడటం ప్రారంభించేవాళ్ళం. తెగేవరకూ ఎప్పుడూ లాగలేదు. కలిసి కొనసాగడంలోనే ఇద్దరికీ మనశ్శాంతి ఉందని గ్రహించేవాళ్లం.

ఈ దుకాణం యజమానితో అటువంటి అనుబంధం ఏముంది! అయినా, మనస్సులో ఏదో ములుకులా గుచ్చుకుంటూనే ఉండేది నాకు, ఆ దుకాణం వైపు నుంచి వెళ్ళినప్పుడల్లా. దానికి తోడు మా పనిమనిషి తనకి కావల్సిన సరుకులు ఆ దుకాణం

నుంచే తెచ్చుకునేది. నేను కూడా చివరికి అత్యవసరమైనప్పుడు చీపురు కట్టలాంటివి కావల్సి వచ్చినప్పుడు పనిమనిషి చేత ఆ దుకాణం నుంచే తెప్పించేదాన్ని. అతనికి తెలుసు. ఏ వస్తువులు నా కోసం కొంటోందో. అతను కూడా మరీ బిగుసుకు పోయిలేదు. ఎవరైనా మా ఇంటి గుర్తులు అడిగితే చెప్పి పంపించేవాడు. అయినా ఇద్దరం ఒకరినొకరు పలకరించడానికి అహం అడ్డొస్తూనే ఉంది. నిజానికి నా వంటి ఒక ఖాతాదారు పోయినందువల్ల అతనికొచ్చే పెద్ద నష్టం ఏమీ లేదు. ఇంకొంచెం దూరం నడవాలని తప్పితే, చుట్టు పక్కల బోలెడు దుకాణాలున్నాయి నేను వెళ్ళడానికి.

ఈ మధ్య కొన్ని రోజుల నుంచి ఆ దుకాణం మూసేసి ఉంటోంది. ఇది వరకు కూడా అతను వాళ్ళ ఊరుకెళ్ళినప్పుడు దుకాణం మూసేసి వెళ్ళేవాడు. అతను పెద్ద వాడే వయస్సుకి, కానీ ఒంటరివాడని విన్నాను. ఒక్కడే ఉంటున్నాడనుకున్నాను. ఈసారి మా పనిమనిషి ఒక వార్త మోసుకొచ్చింది. ఆ దుకాణం యజమాని తమ్ముడు హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడుట.

ఇందాక మందులు కొనుక్కోవడానికి వెడుతున్నప్పుడు ఆ కిరాణా దుకాణం తెరిచి ఉండటం చూశాను. దుకాణం యజమాని గుమ్మం ముందు వంగి అట్టపెట్టెలు సర్దుకుంటూండటం చూశాను. పలకరించాలా వద్దా అని మనస్సు ఊగిసలాడింది. ముందుకి సాగి మందుల దుకాణానికి వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పటికి ఇంకా అతను దుకాణం గుమ్మం ముందే ఉన్నాడు. దగ్గరికి వెళ్ళి, "పాపం, మీ తమ్ముడు పోయాడుట కదా" అన్నాను.

నేను పలకరించినందుకు అతని ముఖంలో సంతోషం కనిపించింది. "అవునండీ, కొడుకూ కోడలూ బొంబాయి నుంచి వచ్చారు, ఇక్కడ మా బంధువుల ఇంట్లో పెళ్లవుతోందని. వాళ్ళు తిరిగి వెళ్ళడానికి సిద్ధమవుతూండగా హఠాత్తుగా మా తమ్ముడికి గుండె పోటు వచ్చింది. ఆసుపత్రికి తీసుకు వెళ్ళే లోపునే పోయాడు. ఈ మధ్య బొంబాయిలో జరిగిన బాంబుల గొడవల్ని తలుచుకుంటూ కొడుకు కుటుంబం గురించి భయపడుతూండేవాడు. ఆ భయమే వాణ్ణి పొట్టన పెట్టుకుందండి" అన్నాడు.

"అయ్యో పాపం, మీ మరదలు ఎలా ఉన్నారు?" అన్నాను.

"ఆవిడ గవర్నమెంటు ఉద్యోగం చేస్తోందండి. ఇంక రిటైరయ్యే టైము దగ్గర కొచ్చిందండి. డ్యూటీకి వెళ్ళక తప్పదు కదండీ" అన్నాడు.

"అలా ధైర్యంగా ఉండటమే మంచిది లెండి" అన్నాను.

ఈ లోగా ఎవరో ఖాతాదారు వచ్చాడు. నేను వచ్చేశాను.

ఇంతవరకూ నేను మోస్తున్న 'అహం' బరువు తగ్గి, నా మనస్సు ఇప్పుడు ఎంతో తేలిగ్గా ఉంది.

*(చేతన, ఫిబ్రవరి 2009)*